సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 21 । ఆగస్టు । 2024



మూడోసారి నాట్లు

ఈ ఏడాది కురిసిన భారీ వర్షాలకు వరి రైతులు కుదేలయ్యారు. ఇప్పటికే రెండు సార్లు నాట్లు వేయగా, వర్షాల వల్ల చేలు మునిగి కుళ్లిపోయాయి. 8లో ▸



ఆర్బీకేల నిర్వీర్యం

గత ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా రైతులకు అండగా నిలవగా, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎరువులను సొసైటీల ద్వారా విక్రయిస్తూ ఆర్బీకేలను నిర్వీర్యం చేస్తోంది. 8లో ▸



పెలికాన్‌లతో కొల్లేరు కళకళ

ఆటపాక పక్షుల కేంద్రంలో వందలాది పెలికాన్ పక్షులు చేస్తున్న కిలకిలరావాలు బోటు షికారు చేస్తున్న పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. 8లో ▸

మళ్లీ పరేషన్

అవస్థలు తప్పవేమోనని లబ్ధిదారుల్లో ఆందోళన



ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీకి కూటమి ప్రభుత్వం మంగళం పలుకనున్న నేపథ్యంలో లబ్ధిదారుల కష్టాలు మళ్లీ పునరావృతం కానున్నాయి. ఎక్కడో దూరంగా ఉన్న చౌకడిపోలకు వెళ్లడమే కాక అక్కడ గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి రేషన్ తీసుకుని వ్యయప్రయాసలతో ఇంటికి తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడనున్నాయి. దీంతో చంద్రబాబు ప్రభుత్వంలో తమ కష్టాలు మళ్లీ మొదటికి వస్తాయంటూ లబ్ధిదారులు ఘొల్లుమంటున్నారు.

- ఇంటికే రేషన్‌కు కూటమి ప్రభుత్వం మంగళం?
- నిలిచిపోనున్న ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ
- జగన్ పాలనలో 5,67,671 లబ్ధిదారులకు ఇంటికే రేషన్

భీమవరం: ఇంటి వద్దకే రేషన్‌ను ఎత్తేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది. రోజుల తరబడి క్యూలైన్‌లో నిలబడి రేషన్ కోసం తంటాలు పడకుండా గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో తీసుకొచ్చిన ఈ పథకంపై చంద్రబాబు తన అక్కసు వెళ్లగక్కారు. ఇంటికే రేషన్‌కు మంగళం పాడితే వృద్ధులు, వికలాంగులు, మహిళలు రేషన్ సరుకులు తెచ్చుకోడానికి పడరానిపాట్లు పడాల్సిందే. రేషన్ షాపులకు వెళ్లలేనివారికి మాత్రమే ఇంటికి వెళ్లి ఇవ్వాలి తప్ప అందరికీ ఎండీయూ ద్వారా రేషన్ ఇవ్వడం ఏమిటని చంద్రబాబునాయుడు కలెక్టర్ల సమావేశంలో ప్రశ్నించడంతో ఇక ఈ పథకాన్ని ఎత్తేసేందుకు నిర్ణయించారని తెలుస్తోంది. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ పథకం ఉపయోగం లేదంటూ తేల్చిచెప్పిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఇంటికే రేషన్‌కు కూటమి ప్రభుత్వం మంగళం పలకనుందని తేలడంతో లబ్ధిదారుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది.



పాలకోడేరు మండలంలో ఎండీయూ వాహనం ద్వారా రేషన్ సరుకులు ఇంటివద్దకే పంపిణీ దృశ్యం

జిల్లాలో 356 ఎండీయూ వాహనాలు

పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల్లో 5,67,671 రేషన్‌కార్డుల లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందించడానికి 356 ఎండీయూ వాహనాలు ఏర్పాటు చేశారు. వీటిలో ప్రస్తుతం మూడు ఖాళీలుండగా 30 మందిని తాత్కాలికంగా, మిగిలిన వారు శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తున్నారు. ఎండీయూ వాహనదారులకు ప్రభుత్వం నెలకు రూ. 18 వేలు చొప్పున అందిస్తోంది. వీటి ద్వారా ప్రతి నెలా 8,702 మెట్రిక్ టన్నుల బియ్యం, 567 మెట్రిక్ టన్నుల కందిపప్పు, 300 మెట్రిక్ టన్నుల పంచదార పంపిణీ చేసేవారు. ఇంటివద్దకే రేషన్ సరుకులు రావడంతో ప్రధానంగా వృద్ధులు, మహిళలు, వికలాంగులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేది. గతంలో మాదిరిగా రేషన్‌షాపులకు వెళ్లి గంటల తరబడి క్యూలైన్లో నిలబడడం, దూరప్రాంతం నుంచి బరువులను మోసుకువెళ్లడం వంటి ఇబ్బందులు జగన్ ప్రభుత్వ హయాంలో లేవు. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ వల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాదిమంది ఎండీయూ వాహన ఆపరేటర్లు, వారి సహాయకులు ఉపాధి పొందారు.

ఈ వయసులో సాధ్యమా?



నా వయసు 75 ఏళ్లు. చక్కగా బండి ఇంటికే వచ్చి బియ్యం ఇచ్చేది. ఇప్పుడు మళ్లీ ఎన్నో అవస్థలు పడుతూ దుకాణానికి వెళ్లి రేషన్ తెచ్చుకోవాలంటే ఈ వయసులో సాధ్యమా. గతంలో ఎంతో దూరంలో ఉన్న దుకాణాలకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి వచ్చేది. ఒక్కసారి చంద్రబాబు ప్రభుత్వం ఆలోచించాలి.

– తంగేళ్ల మరియమ్మ, గొల్లలకోడేరు

క్యూలో నిలిచి తెచ్చుకోవాల్సిందే



ఇంటింటికి రేషన్ పంపిణీ నిలుపుదల చేయడం సరి కాదు. పనులు చేసుకుని ఇంటికి వచ్చినప్పుడు వేలి ముద్ర వేసి రేషన్ సరుకులు తీసుకునేవాళ్లం. ఇంటింటికి రేషన్ నిలిపివేస్తే పనులు మానుకుని రేషన్ షాపునకు వెళ్లి, క్యూలో నిలబడి రేషన్ తెసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడతాయి.

– కాండ్రేకుల శ్రీనివాస్, కొణితివాడ

మళ్లీ ఆ అవస్థలు పడాలేమో!



అయ్యో... జగనన్న రేషన్ బియ్యం బండిని మా ఇంటికే పంపి రేషన్ ఇచ్చాడు. ఇప్పుడు చంద్రబాబు వాటిని తీసేస్తారనడంతో బాధగా ఉంది. మళ్లీ ఇదివరకటిలా దూరంగా ఉన్న రేషన్ షాపునకు వెళ్లి తెచ్చుకోవాలంటే మళ్లీ గంటల తరబడి క్యూలో నిలబడక తప్పదేమో.

– విప్పర్తి జూలియమ్మ, మోగల్లు

వ్యయప్రయాసలు తప్పవు



మా భార్యాభర్తలిద్దరికీ 10 కేజీల రేషన్ బియ్యం వస్తుంది. ప్రతినెలా వాహనంలో వచ్చి బియ్యాన్ని ఇస్తున్నారు. ఇప్పుడు ఎక్కడో ఉన్న చౌకడిపోకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాలంటే వ్యయప్రయాసలు తప్పవు. ఇప్పటికే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాం. ఇంటింటికీ రేషన్ కొనసాగించాలి.

– పి.నరసింహస్వామి, గొల్లవానితిప్ప

ఇప్పటికే కందిపప్పు, పంచదారకు కోత

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బియ్యం మినహా కందిపప్పు, పంచదార ఇవ్వడం లేదు. దీంతో పేదలు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు నిత్యావసరాలు కొనుగోలు చేయక తప్పడం లేదు. వీటికితోడు కూరగాయల ధరలు కూడా ఆకాశాన్నంటడంతో పేదలు, మధ్యతరగతి ప్రజలు ఏం కొనలేం, ఏం తినలేమంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే బియ్యం ఇంటి వద్దకు వస్తున్నాయని సరిపెట్టుకుంటున్న తరుణంలో ఎండీయూ వాహనాలను పూర్తిగా నిలిపివేసేందుకు ప్రభుత్వం సమాయత్తం కావడంతో లబ్ధిదారులు, వాటిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం తమ నిర్ణయాన్ని విరమించుకుని గతంలో మాదిరిగా ఇంటింటికి రేషన్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

న్యూస్‌రీల్

మావుళ్లమ్మ సేవలో కలెక్టర్



అమ్మవారి చిత్రపటాన్ని కలెక్టర్ నాగరాణికి అందజేస్తున్న అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారిని మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికగా, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను కలెక్టర్‌కు అందజేశారు. ఆలయ సహాయ కమిషన్ బుద్ధ మహాలక్ష్మి గణేష్, దేవదాయ శాఖ తనిఖీ అధికారి వి.వెంకటేశ్వర తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్ల నిజాయతీ



తణుకులో ప్రయాణికుడికి నగల బ్యాగ్ అందిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

తణుకు అర్బన్: తణుకు ఆర్టీసీ బస్సులో వదిలివేసిన బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను డ్రైవర్‌లు భద్రంగా ప్రయాణికుడికి అందించి తమ నిజాయతీని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ బీహెచ్‌ఈఎల్ నుంచి తణుకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన పేర్ల ప్రదీప్ తన బ్యాగ్‌ను బస్సులో మరచిపోయి విజయవాడలో దిగిపోయారు. బస్సు గమ్యస్థానం చేరిన అనంతరం బ్యాగ్‌ను గమనించిన డ్రైవర్లు యన్నం వెంకట గోపాలరావు, పెనుమత్స శ్రీనివాసరాజు సెక్యూరిటీ విభాగం ద్వారా డిపో మేనేజర్‌కు అందజేశారు. అనంతరం ప్రయాణికుడు ప్రదీప్‌కు సమాచారం తెలిపి బ్యాగ్‌లో ఉన్న రూ.6 లక్షల విలువైన ఆభరణాల వివరాలను తెలిపిన అనంతరం ఆయనకు అందజేశారు. నిజాయతీగా వ్యవహరించిన డ్రైవర్లతో పాటు డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్‌ను ప్రయాణికులు అభినందించారు.

అత్తిలి బాలికల వసతి గృహం తనిఖీ



అత్తిలి వసతిగృహంలో విద్యార్థినికి భోజనం తినిపిస్తున్న కలెక్టర్ నాగరాణి

అత్తిలి: అత్తిలిలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. వసతి గృహం పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, భోజన వసతులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనాన్ని రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహ విద్యార్థినులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వసతి గృహంలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల రూములు, మరుగుదొడ్లను కలెక్టర్ పరిశీలించారు. అత్తిలి తహసీల్దార్ డి.వంశీ, ఎంపీడీవో అమీలుజమా, ఏఓ వీవీవీఎస్ రామారావు, హెచ్‌డబ్ల్యూఓ ఆర్‌జేడీ లక్ష్మి ఉన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణ

వీరవాసరం: వీరవాసరంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం జిల్లా స్థాయి అధికారుల బృందం ప్రత్యేక విచారణ నిర్వహించారు. 2021 నుంచి 2023 వరకు ఈ కార్యాలయంలో అప్పటి సబ్ రిజిస్ట్రార్‌గా కె.దుర్గారాణి ఉన్న సమయంలో తప్పుడు రిజిస్ట్రేషన్లు జరిగాయని కుడిపూడి పురుషోత్తం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేపట్టారు. కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. విచారణ తుది నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని విచారణాధికారులు తెలియజేశారు.

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష దరఖాస్తుకు 6 వరకు గడువు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 6వ తేదీతో గడువు ముగుస్తుందని డీఈఓ ఎస్. అబ్రహం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తరగతి చదువుతూ కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉన్న విద్యా ర్థులు మాత్రమే అర్హులన్నారు. ఈ పరీక్ష డిసెంబర్ 8వ తేదీన జరుగుతుందని డీఈఓ వివరించారు.

అపరిష్కృత కేసుల దర్యాప్తు వేగిరపర్చండి

భీమవరం: అపరిష్కృతంగా ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలను పూర్తి స్థాయిలో అరికట్టాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. మంగళవారం భీమవరంలో పోలీసు అధికారులతో పెండింగ్, ఎన్డీపీఎస్, మిస్సింగ్, ప్రాపర్టీ, గ్రేవ్, సైబర్ వంటి నేరాలకు సంబంధించిన కేసుల పురోగతిపై నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. అపరిష్కృతంగా ఉన్న తీవ్రమైన కేసుల్లో సాక్ష్యాధారాలతో సమగ్రమైన దర్యాప్తుతో పురోగతి సాధించాలన్నారు. పోలీసు సిబ్బందితో సహా అధికారులు కూడా తప్పనిసరిగా గ్రామ సందర్శనలు చేయాలని, ప్రజలతో మమేకమై గ్రామాల్లోని సమస్యలను గుర్తించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని ఎస్పీ ఆదేశించారు. గంజాయి నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని, గంజాయి కేసుల్లో అరెస్ట్ అయిన నిందితుల నుంచి వారికి అమ్మిన, సరఫరా చేసిన వ్యక్తుల సమాచారాన్ని సేకరించాలన్నారు. జిల్లాలో పూర్తి స్థాయిలో అక్రమ రవాణా అరికట్టాలని, సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు అందిన తక్షణమే చట్ట ప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో గస్తీ విధుల్లో అప్రమత్తంగా ఉంటూ పాత నేరస్తులను తనిఖీ చేసి నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రద్దీ ప్రదేశాలు, మార్కెట్ ప్రాంతాలు, బ్యాంకులు, కళాశాలల వద్ద విజిబుల్ పోలీసింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలు, ఆకతాయిలను కట్టడి చేయాలని అధికారులను ఎస్పీ నయీం ఆస్మి ఆదేశించారు. సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, సెబ్ అదనపు ఎస్పీ ఏటీవీ రవికుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ నయీం అస్మి

మెరుగైన పారిశ్రామిక విధానంపై కసరత్తు

భీమవరం (ప్రకాశం చౌక్): మెరుగైన పారిశ్రామిక విధానం ప్రభుత్వం అమలు చేసేందుకు పారిశ్రామికవేత్తలు తమ సలహాలు అందించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల, ఎగుమతుల ప్రోత్సాహక అభివృద్ధి కమిటీ ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. పారిశ్రామికవేత్తలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలియజేస్తే ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. తద్వారా మెరుగైన పారిశ్రామిక విధానం అమలుకు వీలవుతుందన్నారు. పరిశ్రమల స్థాపనకు బ్యాంకులు సహకారాన్ని అందించాలని కోరారు.

సోలార్ పథకం సద్వినియోగం చేసుకోవాలి

విద్యుత్ ఆదాకు సోలార్ రూఫ్‌టాప్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు, వినియోగదారుల బిల్లులు చెల్లింపుపై ప్రచార సాధనాలను కలెక్టర్ పరిశీలించి, సెల్ఫీ దిగారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ యోజన పథకం కింద సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు పెద్ద మొత్తంలో సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. దీనిపై ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



పరిశ్రమల ప్రోత్సాహక సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

వినతులు రీ ఓపెన్ కాకుండా పరిష్కరించండి

మీ కోసంలో ప్రజల నుంచి వినతులను రీ ఓపెన్ కాకుండా పరిష్కరించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ‘మీకోసం’ ఫిర్యాదులను పరిశీలించే విభాగాధిపతులతో ఆమె సమీక్షిస్తూ వినతుల పరిష్కారంలో నాణ్యత పెరగాలని, దీనిపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు.

జ్వరాలపై యంత్రాంగం అప్రమత్తం

తణుకు అర్బన్: జిల్లాలో జ్వరాల కేసులు పెరుగుతుండటంతో యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉందని కలెక్టర్ సీహెచ్ నాగరాణి చెప్పారు. మంగళవారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తణుకు ఆస్పత్రిలో వైద్యసేవలు సంతృప్తిగానే ఉన్నాయన్నారు. పూర్తిస్థాయిలో వైద్యుల ఖాళీల భర్తీకి కార్యాచరణ చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. వార్డులలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజారోగ్యం ఊసేది?

ప్రతికూల వాతావరణ పరిస్థితులు, పారిశుద్ధ్యలేమితో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఎక్కడ చూసినా టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయి. గడిచిన వారం రోజుల వ్యవధిలో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మూడు వేలకు పైనే జ్వరాల కేసులు నమోదుకాగా, ప్రైవేట్ ఆస్పత్రులు, పీఎంపీలను ఆశ్రయిస్తున్న రోగుల సంఖ్యకు లెక్కేలేదు. విషజ్వరాలు జిల్లాను వణికిస్తుండగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

- ప్రతికూల వాతావరణంతో విజృంభిస్తున్న విషజ్వరాలు
- కానరాని ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ, దోమల నిర్మూలన
- వారం వ్యవధిలో మూడు వేలకు పైనే జ్వరాల కేసులు
- రోగులతో కిటకిటలాడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు

సాక్షి, భీమవరం: జిల్లాను పదిరోజుల క్రితం వరకు భారీ వర్షాలు, వరదలు ముంచెత్తగా వారం రోజులుగా వేసవిని తలపిస్తున్న ఎండలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు చేరి మురుగు గుంటలుగా మారాయి. చెత్త తరలింపు సక్రమంగా జరగక చాలా గ్రామాలు పారిశుద్ధ్యలేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. డ్రెయిన్లు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. పైప్‌లైన్ల లీకేజీ సమస్యలతో రక్షిత మంచినీరు కలుషితమవుతోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితులకు తోడు నియంత్రణ చర్యలు కొరవడటం విషజ్వరాల వ్యాప్తికి కారణమవుతోంది. జిల్లాలోని భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నరసాపురం, ఉండి, ఆచంట నియోజకవర్గాల్లోని పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా ఎక్కడ చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. చలి జ్వరం, జలుబు, దగ్గు, తలనొప్పి తదితర లక్షణాలతో రోజుల తరబడి మంచం పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు వైరల్ ఫీవర్ రోగులతో కిటకిటలాడుతున్నాయి. పలు ఆస్పత్రుల్లోని రోజువారీ ఓపీలో జ్వరం కేసులో అధికంగా ఉంటున్నాయి. గడిచిన వారం రోజుల్లో జిల్లాలోని ఆయా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుమారు 30,136 ఓపీ నమోదు కాగా, వీరిలో మూడు వేల మందికి పైగా జ్వరపీడితులే ఉన్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగీ తదితర జ్వరాలతో ప్రైవేట్ ఆస్పత్రులు, గ్రామీణ వైద్యులను ఆశ్రయిస్తున్న వారి సంఖ్య చాలా ఎక్కువగా ఉంటోంది. ప్లేట్‌లెట్స్ కౌంట్, వివిధ రకాల టెస్టులు, వైద్యం పేరిట రోగుల నుంచి రూ.50 వేలు నుంచి రూ.లక్షల్లో బిల్లులు వసూలు చేస్తూ ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు చుక్కలు చూపిస్తున్నాయి.



జ్వరంతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చిన మహిళ



భీమవరం ప్రభుత్వాసుపత్రిలో రక్త పరీక్షల కేంద్రం వద్ద క్యూ కట్టిన రోగులు



తణుకు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

వణికిస్తున్న వింత జ్వరాలు

ప్రస్తుతం వైరల్ ఫీవర్స్ తగ్గాక నొప్పులు, వాపులు ఇతర ఆరోగ్య సమస్యలతో ప్రజలు విలవిలలాడుతున్నారు. ఆకివీడు మండలం దుంపగడపలో వింత జ్వరాలు బెంబేలెత్తిస్తున్నాయి. ఫీవర్ వచ్చిన వారు, రానివారిలో కూడా కీళ్ల నొప్పులు, మడం నొప్పులు, ఒంటి నొప్పులు, కళ్లు, ముఖం ఉబ్బిపోవడం, చర్మంపై దద్దర్లు రావడం, రంగు మారిపోవడం, మచ్చలు పడటం తదితర సమస్యలతో సతమతమవుతున్నారు. కేసులు ఎక్కువగా ఉన్న చోట తంతు నడిపిస్తుండగా పూర్తిస్థాయిలో నియంత్రణ చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో జ్వరాల తీవ్రత, దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయడం, డ్రెయిన్లు శుభ్రం చేయడం, చెత్తకుప్పలు తొలగించి బ్లీచింగ్ చల్లించడం, తాగునీటి క్లోరినేషన్, ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర నియంత్రణ చర్యలు, ఆస్పత్రుల్లో మందులు, రక్త పరీక్షల కిట్లు లభ్యత, జ్వరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కార్యక్రమాలపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రజలను పట్టిపీడిస్తున్న విషజ్వరాల నియంత్రణకు పూర్తిస్థాయిలో జిల్లాయంత్రాంగం చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

‘సర్దుబాటు’లో లోపాలను సరిచేయాలి



డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

భీమవరం: జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న పాఠశాలల పనిసర్దుబాటు ప్రక్రియలో లోపాలను సరిచేయాలని డీఈఓ జి.నాగమణికి ఎఫ్ఏపీటీవో ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఏపీటీవో ప్రధాన కార్యదర్శి పెన్మెత్స సాయివర్మ, యూటీఎఫ్ అధ్యక్షుడు పెన్మెత్స విజయరామరాజు మాట్లాడుతూ కొన్ని పాఠశాలలకు యాప్ ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల కొంతమంది ఉపాధ్యాయులను మిగులుగా గుర్తించారని, వీరిని మిగులు పోస్టుల నుంచి పాఠశాలలను పని సర్దుబాటు నుంచి మినహాయించాలని కోరారు. వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఏకేవీ రామభద్రం, గుత్తుల శ్రీనివాస్, దావీదు, మన్నె వెంకటేశ్వరరావు, పట్టాభి, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



తణుకులోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులకు పాఠాలు బోధిస్తున్న కలెక్టర్ నాగరాణి

తణుకు టౌన్: విద్యార్థి దశలో బాగా చదువుకోవడం ద్వారానే ఉజ్వల భవిష్యత్ తీర్చిదిద్దుకోవచ్చునని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి విద్యార్థినులకు ఉద్బోధించారు. మంగళవారం సాయంత్రం తణుకులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహం పరిసరాలు క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థినులకు అందిస్తున్న భోజనం, వసతి, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. వసతి గృహంలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు చెప్పారు. విద్యార్థినుల భోజనం విషయంలో ఎలాంటి లోపం రాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ, తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్‌వర్మ, హాస్టర్ వెల్ఫేర్ అధికారి వై అరుణ, డీటీ ఉదయ భాస్కర్, మున్సిపల్ డీఈ ఈశ్వర్‌రెడ్డి, మనిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీపీ ఏర్పాటు స్థలం పరిశీలన

ఎన్జీటీ నిబంధనల ప్రకారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సహకారంతో ప్రతి పట్టణంలో ఎస్‌టీపీని ఏర్పాటు చేయవలసి వుంది. సీవేజ్ నీటిని ప్లాంట్ ద్వారా శుద్ధి చేసి కాలువలోకి వదలాలి. దీని కోసం తణుకు మండలం వేల్పూరు రైల్వే గేటు వద్ద రూ. 5.21 ఎకరాలను గుర్తించారు. ఈ స్థలాన్ని జిల్లా కలెక్టర్ నాగరాణి మంగళవారం పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ స్థలానికి సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ భూమి కొనుగోలుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎస్‌టీపీ ఏర్పాటు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను కోరారు.

మహిళ అనుమానాస్పద మృతి

నరసాపురం: పట్టణంలోని పంజా సెంటర్ సూర్యా ఆసుపత్రి సమీపంలోని ఓ ఇంట్లో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. టౌన్ సీఐ బి.యాదగిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అండమాన్ నికోబార్ పైర్క్‌లో నివాసం ఉండే తేస్నేటి బ్లెస్సీ(24) కొన్ని రోజుల క్రితం పట్టణంలో బంధువుల ఇంటికి వచ్చింది. మతి స్థిమితం లేని ఆమె మంగళవారం ఇంట్లో వారు బయటకు వెళ్లిన సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్టుగా భావిస్తున్నారు. ఇంట్లో విగతజీవిగా పడిఉన్న బ్లెస్సీని చూసి బంధువులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు సీఐ వివరించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నరసాపురం: అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం పట్టణ సీఐ బి.యాదగిరి దాడిచేసి పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మేదర్లవంతెన సమీపంలోని ఓ షాపులో పీడీఎస్ బియ్యం నిల్వ ఉందనే సమాచారంతో సీఐ సిబ్బందితో కలసి దాడి చేసి గ్రంధి రాము, మురుకుల రవికుమామార్ అనే ఇద్దరు వ్యక్తులు దాచి ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

ప్రకృతిపైనే భారం.. మూడోసారి నాట్లు

- అధిక వర్షాలకు రెండుసార్లు కొట్టుకుపోయిన నాట్లు
- అప్పులు చేయలేక గగ్గోలు పెడుతున్న రైతులు
- సాయం అందించని కూటమి ప్రభుత్వం





తన చేను పోయిందని ఆవేదన వెలిబుచ్చుతున్న గుమ్మళ్ళరెడ్డియ్య, వెల్లమిల్లి ఆయకట్టులో మూడోసారి నాట్లు వేసిన దృశ్యం

ఉంగుటూరు: ఈ ఏడాది కురిసిన అధిక వర్షాలకు రైతులు కుదేలయ్యారు. రైతులు నాట్లు వేసిన ప్రతిసారి భారీ వర్షాలు కురండంతో అవి కొట్టుకుపోతున్నాయి. ఇప్పటికే రెండుసార్లు ఈ విధంగా జరగడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. అసలే పెట్టుబడి సాయం లేక అక్కడా ఇక్కడా అప్పులు తెచ్చి సాగు పనులు ప్రారంభిస్తుంటే ప్రకృతి సైతం తమపై పగబట్టిందని వాపోతున్నారు. అన్నదాతలు ఇన్ని కష్టాలు పడుతున్నా చేయూత అందించాల్సిన కూటమి ప్రభుత్వం సానుభూతి పలుకులు తప్ప సాయం మాత్రం చేయడం లేదు. జూన్, జూలై మాసాల్లో కురిసిన అధిక వర్షాలకు ఒక్క ఉంగుటూరు మండలంలోనే వెయ్యి ఎకరాలకు పైగా నాట్లు దెబ్బతిన్నాయి. దీంతో సుమారు 150 మంది రైతులు నష్టపోయారు. నాట్లు వేసిన వారం రోజుల నుంచి 25 రోజుల వ్యవధిలోనే నాట్లు దెబ్బతినడంతో రైతులు ఆర్థికంగా చాలా నష్టపోయారు. ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు నష్టపోయారు. తరువాత మళ్లీ నాట్లు వేయడం.. మళ్లీ వర్షాలు కురవడంతో రైతులు రెండోసారి కూడా నష్టపోయారు. అయినా కూటమి ప్రభుత్వం చలించలేదు. ప్రభుత్వ ఆంక్షలు అడ్డుతగలటంతో అధికారులు సైతం రైతులకు ఏమి చేయలేకపోయారు. ఊడ్చిన 30 రోజులు దాటితే గాని రైతులకు నష్టం ఇవ్వకూడదని ప్రభుత్వ నిబంధన ఉంది. దీంతో రైతులకు సానుభూతి తప్ప ఒరిగిందేమి లేదు. ఉంగుటూరు మండలం బాదంపూడి, వెల్లమిల్లి, కాకర్లమూడి, రావులపర్రు, దొంతవరం, కైకరం శివారు భూముల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇందులో కొందరు రైతులు నారుమళ్లు కోల్పోయారు. వ్యవసాయం తప్ప మరోటి చేతకాని రైతన్నలు చేసేదిలేక అక్కడ ఇక్కడ అప్పులు తెచ్చి ప్రకృతిపై భారం వేసి మూడోసారి నాట్లు వేస్తున్నారు.

నాట్లు కొట్టుకుపోయాయి



ఈ ఏడాది అధిక వర్షాలు వలన రైతులు చాలా నష్టపోయారు. నేను నాట్లు వేసి దెబ్బతిన్నాను. నాలేగా చాలామంది రైతులు నాట్లు వర్షాలకు కొట్టుకుపోయాయి. ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదు. – కానూరి శ్రీను, కాకర్లమూడి రైతు

ప్రభుత్వం నుంచి సాయం లేదు



అధిక వర్షాలు రైతులను బాగా దెబ్బతీశాయి. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో భారీ వర్షాలకు నీరు వెళ్లే మార్గం లేక నారుమళ్లు పూరిగా దెబ్బతిన్నాయి. దీంతో చాలామంది రైతులు ఆర్థికంగా నష్టపోయారు. ప్రభుత్వం నుంచి సాయం ఏమి అందలేదు. కొవ్వలి మహేష్, రైతు, దొంతవరం

పారదర్శకత లోపించిన పని సర్దుబాటు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియలో పారదర్శకత లోపించిందని పీఎంటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ. సుమంత్ ఒక ప్రకటనలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవో 53ను అమలు పరచకపోవడమే కాక జీవో 117ను మాత్రమే అమలు పరచడం దురదృష్టకరమన్నారు. సర్దుబాటు ప్రక్రియలో ప్రతి పాఠశాలలో మిగులు ఉపాధ్యాయుల వివరాలు, డెఫిసిట్ పాఠశాలల వివరాలు అన్నీ యాజమాన్యం వారీగా ఏర్పాటు చేయకుండా అన్ని యాజమాన్యాలను కలిపి ఒకే జాబితాలో పొందుపరచడం వల్ల యాజమాన్యంతో సంబంధం లేకుండా అధికారులు కౌన్సిలింగ్‌లను నిర్వహించి అదే యాజమాన్యంలో సర్దుబాటు చేయలనే నిబంధనను తుంగలో తొక్కారన్నారు. దీనితో కొన్ని చోట్ల మాతృ యాజమాన్యం వారికి అన్యాయం జరిగిందని, కొన్ని చోట్ల మున్సిపల్ టీచర్స్ ప్రతిఘటనతో కౌన్సిలింగ్ ఆగిపోయిందన్నారు. హిందీ ఉపాధ్యాయులకు సర్దుబాటులో 10వ సెక్షన్ వద్ద బయాలజీతో పాటు ఒక హిందీ పోస్ట్ కేటాయిస్తున్నారు కానీ 16వ సెక్షన్లో అదే బయోలజీ వారితో పాటు హిందీ పోస్ట్ లేకపోవటం వల్ల సదరు హిందీ పోస్టును కోల్పోతున్నారన్నారు. ఉన్నత పాఠశాలలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్‌లకు యూపీ స్కూల్ ఆప్షన్ చూపటంతో వారందరు యూపీలకు తరలిపోయి, హైస్కూల్లో ఉన్న ఖాళీలను తదుపరి అంచెలో ఎస్‌జీటీలతో నింపుకోవాల్సి వస్తుందని, దీనితో యూపీ స్కూల్లో బోధన చేయాల్సిన ఎస్‌జీటీలు హైస్కూల్‌లకు, హైస్కూల్‌లో బోధించాల్సిన ఎస్ఏలు యూపీలకు తరలిపోవటం శోచనీయమన్నారు.

ఆర్‌బీకేల్లో ఎరువుల విక్రయాలకు మంగళం

- గత ప్రభుత్వంలో 409 ఆర్‌బీకేల్లో.. నేడు సొసైటీల్లోనే..
- దూరప్రాంతాల్లో కొనుగోలుతో పెరగనున్న రవాణా ఖర్చు
- నిరుపయోగంగా మారనున్న ఆర్‌బీకేల్లోని కియోస్క్‌లు





భీమవరం మండలం శ్రీరామపురంలోని ఆర్‌బీకే భవనం, నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం

భీమవరం: గత వైఎస్ జగన్ ప్రభుత్వంలో రైతులకు ఎన్నో విధాలుగా అండగా నిలిచిన ఆర్బీకేలను నిర్వీర్యం చేసే దిశగా ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఒకప్పుడు వ్యవసాయం దండగ అంటూ రైతులను నిరుత్సాహపర్చిన చంద్రబాబునాయుడు నేడు రైతు భరోసా కేంద్రాలకు (ఆర్‌బీకే) మంగళంపాడే పనిలో పడ్డారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, పురుగుమందుల విక్రయాల ద్వారా రైతులకు ఇతోధికంగా సేవలందించగా, ప్రస్తుత ప్రభుత్వం ఆర్బీకే సేవలకు స్వస్తి చెప్పి ప్రైవేటు వ్యాపారులను ప్రోత్సహించే చర్యలు చేపట్టింది. వ్యవసాయమే జీవానాధారమైన జిల్లాలో రైతుల మేలు కోరి జిల్లా వ్యాప్తంగా 409 ఆర్‌బీకేలను ఏర్పాటు చేశారు. రైతులకు ఎరువులు, పురుగు మందులు దళారుల ప్రమేయం లేకుండా నేరుగా తక్కువ ధరకు కొనుగోలు చేసేలా ఆర్‌బీకేల్లో కియోస్క్‌లను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా బుక్ చేసుకున్న పురుగుమందులు, ఎరువులు నేరుగా రైతు పొలం వద్దకు అందేలా చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత ఆర్‌బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేసింది. అంతేకాక వీటి ద్వారా ఎరువులు, పురుగుమందుల విక్రయాలను నిలిపివేసి కేవలం సొసైటీల్లోనే వీటిని విక్రయించేలా చర్యలు తీసుకుంది. జిల్లాలోని 127 సహకార సంఘాల ద్వారా ప్రస్తుతం ఎరువులు, పురుగుమందుల విక్రయాలు చేస్తున్నారు. దీంతో ఆర్బీకేల్లో కియోస్క్‌లు నిరుపయోగంగా మారడమే కాక రైతులు దూరప్రాంతాలకు వెళ్లి ఎరువులు కొనుగోలు చేయాల్సి రావడంతో రవాణా ఖర్చులు పెరుగుతున్నాయి. అంతేకాక మున్ముందు ఎరువులు అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తుందని రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

పెలికాన్ పక్షుల కిలకిలలు



ఆటపాక పక్షుల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇనుపస్టాండ్లపై పెలికాన్ పక్షులు

కైకలూరు: పెలికాన్ పక్షుల కిలకిలలతో కొల్లేరు కళకళలాడుతోంది. పెలికాన్ ప్యారడైజ్‌గా పేరుపొందిన ఆటపాక పక్షుల కేంద్రంలో పక్షుల విహారానికి అటవీశాఖ 289 ఎకరాల్లో చెరువును ఏర్పాటు చేసింది. ఇవి సంతానోత్పత్తి చేయడానికి 150 కృత్రిమ ఇనుపస్టాండ్లను నిర్మించారు. ఇటీవల వీటిలో 60 స్టాండ్లు దెబ్బతిన్నాయి. పక్షుల కేంద్ర అభివృద్ధి నిధులు రూ.20 లక్షలలో భాగంగా వీటిని ఇటీవల అటవీశాఖ ఏర్పాటు చేసింది. వాటిపై పెలికాన్ పక్షులు నివాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. బోటు షికారులో వెళుతున్న పర్యాటకులు స్టాండ్లపై వందలాది పెలికాన్ పక్షులను చూస్తూ నయనానందం పొందుతున్నారు. ప్రస్తుతం ఆటపాక పక్షుల కేంద్రంలో 3000 పైబడి పెలికాన్ పక్షులు ఉన్నాయి. అటవీశాఖ డెప్యూటీ రేంజర్ జీవీవీ జయప్రకాష్ మాట్లాడుతూ అక్టోబరు నెల నుంచి లక్షలాదిగా వలస పక్షులు కొల్లేరుకు చేరుతాయని చెప్పారు.

యువతకు స్ఫూర్తి 'మన సమతానగర్'



స్థానిక సమతానగర్‌లో గుంతల రోడ్డును బాగుచేసుకున్న యువత

ఆకివీడు: యువత నడుం బిగించి తమ వాడలోని సమస్యను పరిష్కరించారు. వివరాల్లోకి వెళితే స్థానిక నగర పంచాయతీ పరిధిలోని సిద్దాపురం గేటు వద్ద నుంచి సమతానగర్ వెళ్లే మార్గం వర్షం వస్తే మునిగిపోతుంది. లోతట్టు ప్రాంతం కావడంతో దుక్కి వర్షానికే రోడ్డు నీట మునుగుతుంది. ఈ ప్రాంతంలో సుమారు 200 కుటుంబాలకు పైగా నివసిస్తున్నారు. వరి, చేపలు, రొయ్యల చెరువులు, రైస్‌మిల్లులకు మార్గంగా సమతానగర్ రోడ్డు ఉంది. కోళ్లపర్రు గ్రామానికి బైపాస్ రోడ్డుగా కూడా ఉపయోగిస్తున్నారు. దీంతో నిత్యం వందలాది మంది జనం, వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. అయితే లోతట్టు రోడ్డు కావడంతో వర్షం వస్తే మునిగిపోతుంది. దీంతో తమ ప్రాంత రహదారిని తామే బాగుచేసుకుందామని అక్కడ యువత 'మన సమతానగర్' పేరిట వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసి ఆగస్టు 15వ తేదీన నిర్ణయం తీసుకున్నారు. అనుకున్నదే తడవుగా నిధుల సేకరణ ప్రారంభించారు. గ్రామ పెద్దలు, రాజకీయనాయకులు, ఆయా ప్రాంతాల్లోని చెరువుదారులు, రైస్‌మిల్లర్లు ఆర్థిక సహకారం అందజేయడంతో యుద్ధప్రాతిపదికన రహదారిని పునర్నిర్మించారు. మూడు రోజుల వ్యవధిలో సుమారు అరకిలోమీటరు రోడ్డును అభివృద్ధిపరచారు. పలువురికి స్ఫూర్తిగా నిలిచిన ఆ యువత కృషిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.

వృద్ధుల దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణమూర్తి

ద్వారకాతిరుమల: ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణమూర్తి కోరారు. ద్వారకాతిరుమలలోని శ్రీ వేంకటేశ్వర బ్రాహ్మణ నిత్యాన్నదాన సదనం సమావేశ మందిరంలో మంగళవారం సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. నారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుకునూరి రామచంద్రరావు నివేదికను తెలియజేశారు. సభలో నారాయణమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులు–వృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం 2007ను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రెవిన్యూ డివిజనల్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పులను అమలుపరచడంలో జరుగుతున్న జాప్యాన్ని తొలగించి, సత్వరమే వయోవృద్ధులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. అక్టోబర్ 1న ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని కోరుతూ తీర్మానించారు.

దేవదాయ భూముల పరిరక్షణకు కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): దేవదాయ భూముల పరిరక్షణకు సమష్టిగా కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ నందు దేవాదాయ భూముల సంరక్షణపై జిల్లా స్థాయి ఇంటర్నల్ డిపార్ట్‌మెంటల్ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఇప్పటికే అన్యాక్రాంతమైన దేవాదాయ భూముల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై జేసీ సమీక్షించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తొలి సమావేశంలో తాడేపల్లిగూడెం తాళ్ల ముదునూరుపాడు గ్రామం బాల వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన అన్యాకాంతమైన భూమి 17.26 ఎకరాలలో 156 మంది స్వాధీనంలో ఉన్న భూములపై సమీక్షించారు. వీటిపై దేవస్థానం అధికారులు దేవస్థానం ట్రిబ్యునల్ విచారణకు వేయగా 86 డిక్రీలను పాస్ చేయడం జరిగింది. దీనిపై 14 మంది హైకోర్టును ఆశ్రయించారు. ఈరోజు నిర్వహించిన సమీక్షలో జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 14 కేసులను తాత్కాలికంగా మినహాయించి, మిగిలిన కేసులకు సంబంధించిన భూములు స్వాధీనం చేసుకునేందుకు చర్యలు ప్రారంభించాలన్నారు. ఈ స్థలాల్లో పక్కా గృహాలు, బ్యాంకు, విద్యుత్ సబ్ స్టేషన్ ఉన్నాయని ఎండోమెంట్ అధికారులు జేసీ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసి రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఎండోమెంట్స్, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలు క్షేత్రస్థాయిలో సందర్శించి నివేదికను తయారు చేయడంతో పాటు, భూమి అనుభవిస్తున్న వారితో మాట్లాడి రెండు వారాల్లో ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కమిటీ సభ్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ జె.ఉదయభాస్కర రావు, అడిషనల్ ఎస్పీ వి భీమారావు, తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి ఆర్డీఓ శివన్నారాయణ రెడ్డి, ఎండోమెంట్ డీఈవో టీవీ సుబ్బారావు, తాడేపల్లిగూడెం, భీమవరం డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్‌లు సుజన్ కుమార్, వెంకటేశ్వర రావు, ఈవో శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆర్ సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారి లోకేశ్వరరావు, జిల్లా సర్వే అధికారులు కె.జాషువా, జిల్లా పంచాయతీ అధికారి ఆర్ విక్టర్, భీమవరం, తణుకు మున్సిపల్ కమిషనర్‌లు శ్యామల, బి రమణ, టీపీఓ మణిరామ్ తదితరులు పాల్గొన్నారు.

వట్లూరులో చోరీ

ఏలూరు టౌన్: పెదపాడు మండలం వట్లూరు గ్రామ శివారు ఇంద్రప్రస్థ హౌసింగ్ కాలనీలో ఒక ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి వస్తువులు, నగదును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఏలూరు త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి. ఇంద్రప్రస్థ గేటెడ్ హౌసింగ్ కాలనీలో నివాసం ఉంటున్న ఎస్.ప్రసాద్ ఈనెల 17న విజయవాడలోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లారు. మంగళవారం తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. గదిలోని బీరువా పగలగొట్టి లోపల ఉన్న బంగారు, వెండి ఆభరణాలు, రూ.25వేల నగదును అపహరించినట్లు గుర్తించారు. ప్రసాద్ ఏలూరు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీ అజయ్‌కుమార్ తెలిపారు.

విలువ ఆధారిత ఉత్పత్తులతో ఆదాయం

నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ టి.అనిల్‌కాంత్



నాబార్డు శిక్షణ పొందిన మహిళకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న నాబార్డు అధికారి టి.అనిల్‌కాంత్

తాడేపల్లిగూడెం: మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించడానికి నాబార్డు ఎన్నో కార్యక్రమాలను చేపడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆదాయాలు పెంచుకోవాలని నాబార్డు ఉమ్మడి జిల్లా అభివృద్ధి అధికారి టి.అనిల్‌కాంత్ కోరారు. సూక్ష్మ వ్యాపార అభివృద్ధి కార్యక్రమం కింద వైఎస్సార్ ఉద్యానవర్సిటీ, కేవీకే సంయుక్తంగా నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమం మంగళవారం వెంకట్రామన్నగూడెంలో జరిగింది. అనిల్ కాంత్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా మహిళలకు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీని ప్రోత్సహించడానికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటుచేస్తుందన్నారు. మహిళలు స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి వారి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవాలన్నారు. అగ్రిబిజినెస్, అగ్రిక్లినిక్ కేంద్రాల గురించి వివరించారు. చిరుధాన్యాలతో బిస్కెట్లు, కూరగాయ పచ్చళ్లు, మామిడి, నేరేడు. నన్నారి, కొబ్బరిపాల రసాలను, మిక్స్‌డ్‌ఫ్రూట్ జామ్, తేనెతో తయారు చేసిన ఉత్పత్తులను మహిళలు తయారు చేశారు. కేవీకే సమన్వయకర్త ఇ.కరుణశ్రీ మాట్లాడుతూ కుటుంబ ఆదాయాలను పెంచుకోడానికి ఇలాంటి శిక్షణలు మహిళలకు ఉపకరిస్తాయన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు వి.దీప్తి, దేవీవరప్రసాదరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, వెంకట సతీష్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ, వెంకట్రామన్నగూడెం, తెలికచర్ల గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. ఉత్పత్తుల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలలో దంతవైద్య శిబిరం



తణుకులో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

తణుకు: తణుకు ఎస్ఎస్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. మహి మల్టీస్పెషాలిటీ డెంటల్ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు రోజా విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రిన్సిపాల్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

పేద మహిళలకు సాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): వల్లిమోహన్ యువజన సేవా సమితి సభ్యులు మంగళవారం పాతూరు మసీద్ సెంటర్‌లో నెలవారీ కార్యక్రమంలో భాగంగా నలుగురు పేద మహిళలకు 20 కేజీలు చొప్పున బియ్యం, నూనె ప్యాకెట్లు, నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందజేశారు. ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాసరావు, సేవా సమితి అధ్యక్షుడు పటాన్‌వల్లి, అడపా తిలక్, గొల్లేరు మోహన్ పాల్గొన్నారు.

కొల్లి రమావతికి సేవా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రమావతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణానికి చెందిన కవయిత్రి, శ్రీశ్రీ కళా వేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతికి తెలుగు తేజం జాతీయ విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు. రమావతిని మంగళవారం పలువురు అభినందించారు. గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ సంబరాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, అమలాపురంలో రమావతికి పురస్కారం అందజేశారు.

లక్ష గులాబీలతో అర్చన



సర్వమంగళ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శంకరమఠంలోని సర్వమంగళ అమ్మవారికి మంగళవారం లక్ష గులాబీలతో అర్చన, భక్తులచే విశేష కుంకుమార్చనలు నిర్వహించారు. శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర స్వామికి, ఆదిశంకరాచార్య స్వామికి విశేష పూజలు చేశారు. భక్తులు విశేషంగా హాజరై అమ్మవారిని దర్శించారు.

గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం



ఆటో ద్వారా బియ్యం పంపుతున్న జనార్దన్‌రావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయమని పలువురు కొనియాడారు. ఆర్గనైజేషన్ ట్రస్టీ, వైఎస్సార్ సీపీ నాయకులు జనార్దన్‌రావుచే పట్టణం నుంచి పడాల జీవన్ సంధ్య వృద్ధాశ్రమానికి 200 కిలోలు, లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోంకు 150, నిడదవోలు లెప్రసీ కాలనీ వారికి 300, చొప్పున ఆటో ద్వారా మొత్తం 650 కిలోల బియ్యం పంపారు. వృద్ధాశ్రమం, చిల్డ్రన్ హోం, కాలనీ సభ్యులు బియ్యం అందుకున్నారు. దాత వాణి సహకరించారు. వలంటీర్లు దుర్గా ప్రసాద్, నాగరాజులు పర్యవేక్షించారు.

మానవత శాంతి ర్యాలీ

పెంటపాడు: మానవత సంస్థ సమాజ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం పెంటపాడు ఎస్టీవీఎన్ హిందూ హైస్కూలు వద్ద మానవత శాంతి ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. పెంటపాడు జీబీటీ స్కూలు విద్యార్థులు గేట్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో మానవత జిల్లా విద్యా కమిటీ చైర్మన్ తాడేపల్లి మోహనరావు, మానవత మండల సభ్యులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ల షెడ్డు ప్రారంభం

పెంటపాడు: పెంటపాడు డంపింగ్ యార్డు వద్ద మానవత ఫ్రీజర్స్ భద్రపరచేందుకు వీలుగా నిర్మించిన షెడ్‌ను మంగళవారం మానవత జిల్లా నాయకులు తాడేపల్లి మోహనరావు ప్రారంభిచారు. మృతదేహాలను బంధువుల దర్శనార్థం రోజుల తరబడి ఉంచేందుకు వీలుగా ఈ ఫ్రీజర్స్ ఉపయోగపడతాయని మోహనరావు తెలిపారు. ఈ షెడ్డు నిర్మాణానికి పాటుపడిన మానవత నాయకులు తారాడి పాల్‌ను ఈ సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానవత మండల అధ్యక్షుడు మీసాల సత్యనారాయణ, ఉమామహేశ్వరం, కె.పంటపాడు సర్పంచ్‌లు మద్దుకూరి నాగేశ్వరరావు, పీతల సత్యనారాయణ, ఏలూరి వీరాస్వామి, నక్కా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు

- ఇదేం ఎండ.. బాబోయ్ అంటున్న జనం
- మే నెలను తలపిస్తున్న ఆగస్టు
- ఉదయం నుంచే ఉష్ణ ప్రతాపం
- ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రయాణికులు, కార్మికులు



తణుకులో సాయంత్రమైనా తగ్గని ఎండ ప్రభావం

తణుకు: సాధారణంగా ఆగస్టు నెల వచ్చిందంటే చాలు ఎడతెరిపి లేని వర్షాలు.. ముసురుతో వాతావరణం చల్లబడుతుంది. అయితే ఈ ఏడాది మాత్రం ఆగస్టులో సైతం ఎండ వేడిమి అల్లాడిస్తోంది. ప్రస్తుతం తణుకు నియోజకవర్గంలో వాతావరణం మే నెల ఎండలను తలపిస్తున్నాయి. ఇంటి నుంచి బయటకు రావడానికే ప్రజలు వెనుకడుగు వేస్తున్నారు. ఏటా జూలైనుంచి ఎండలు తగ్గుముఖం పడతాయి. అయితే ఇక్కడ మాత్రం వేసవిని తలపిస్తూ పదిరోజులుగా ఎండలు మండుతున్నాయి. సాధారణంగా ఆగస్టులో తణుకులో గరిష్ట ఉష్ణోగ్రతలు 27 డిగ్రీలుగా ఉంటాయి. ప్రస్తుతం 32 నుంచి 36 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. మంగళవారం తణుకులో 34 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇళ్లల్లో ఫ్యాన్లు, ఏసీలు నిరంతరం తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. వీధుల్లో జన సంచారం కూడా మధ్యాహ్నం పూట కనిపించడం లేదు.

వర్షాభావ పరిస్థితులే కారణమా?

వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండ తీవ్రత పెరిగినట్లు తెలుస్తోంది. ఈ మధ్య వర్షాలు కురిసినా ఎండలు తగ్గలేదు. గతంలో ఎప్పుడూ ఇలాంటి ఎండలను ఆగస్టులో చూడలేదని స్థానికులు చెబుతున్నారు. ఉక్కబోత కారణంగా దుస్తులన్నీ చెమటతో తడిసిపోతున్నాయని ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం తణుకు నియోజకవర్గంలో వరినాట్లు సాగుతున్నాయి. వరినాట్లకు వచ్చే కూలీలు కూడా ఎండల కారణంగా పెద్దగా పనులకు రావడం లేదు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా పంటలకు సైతం నీటి తడులు ఎక్కువగా ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వ్యవసాయ విద్యుత్ వినియోగం ఈ నెలలో భారీగా పెరిగింది. ఉపాధి పనులు సైతం తగ్గుముఖం పట్టాయి.

జాగ్రత్తలు తీసుకోవాలి



ఆగస్టులో ఈ సారి ఎండలు మండుతున్నాయి. ఎండలోకి వెళ్లే ముందు తలపై టోపీ లేదా గొడుగు ధరించాలి. కళ్లకు నల్లటి కూలింగ్ కళ్లద్దాలు పెట్టుకోవడం మేలు. కూలి పనులు చేసే వారు ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎక్కువ ఎండలో ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నీటితో పాటు కొబ్బరి బొండాలు, పుచ్చకాయలు లాంటివి తీసుకోవాలి. ఉదయం పూట రాగి జావ మజ్జిగతో కలిపి తీసుకుంటే ఉష్ణ తాపానికి విరుగుడుగా ఉపయోగపడుతుంది.

– డాక్టర్ ఎస్.శోభాశరణ్, ఎండీ, జనరల్ ఫిజీషియన్ (ఫిలిప్‌పెన్స్), తణుకు

మెడికల్ షాపులో తనిఖీ

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం కోనాల గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రాథమిక చికిత్సా కేంద్రంలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ విచారణ చేపట్టారు. మంగళవారం కోనాలలో ఈ కేంద్రం పక్కనే మెడికల్ షాపును కూడా నిర్వహిస్తుండటంతో తణుకు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పి.మల్లికార్జునరావు మంగళవారం సోదాలు నిర్వహించారు. ఈ మెడికల్ షాపులో ఫార్మాసిస్ట్ అందుబాటులో లేరని, కాలం తీరిన మందులు స్టాక్‌లో కలిసిపోయి ఉన్నట్లు గుర్తించినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ విచారణకు సంబంధించిన పూర్తి నివేదికను ఏడీ ఏకు సమర్పిస్తామని ఆయన తెలిపారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

తాడేపల్లిగూడెం రూరల్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.శ్రీదేవి అన్నారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని నందమూరు అంగన్‌వాడీ సెంటర్ 143లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ మహిళా కేంద్రీకృత పథకాల్లో మహిళా లబ్ధిదారుల నమోదు అత్యంత ఆవశ్యకత సంతరించుకుందన్నారు. మహిళా పథకాలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వైవీ జయలక్ష్మి, కె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

డ్రై డేతో దోమల వ్యాప్తి నియంత్రణ



వెంకట్రామన్నగూడెం పీహెచ్‌సీ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: డ్రైడే పాటించడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని వీఆర్ గూడెం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీహర్ష అన్నారు. ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం గ్రామంలో దోమల నివారణపై ప్రతిజ్ఞ, అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ దోమలు పెరగకుండా ప్రజల్లో డ్రైడే ఫ్రైడే పట్ల అవగాహన కల్పించాలన్నారు. డెంటిస్ట్ భూపతిరావు, సీహెచ్ఓ సూర్యకాంతం, హెచ్‌వీ జ్యోతి, హెచ్ఎస్ లక్ష్మణ్, ఫార్మసిస్ట్ రామారావు, హెల్త్ అసిస్టెంట్స్ రామకృష్ణ, వెంకటేష్, స్టాఫ్ నర్స్ గ్రేస్, సూర్యకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆడ ఎనాఫిలిస్ దోమ వల్లే మలేరియా

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆడ ఎనాఫిలిస్ దోమ వల్లే మలేరియా వస్తుందని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ ఆఫీసర్ వైవీ లక్ష్మణరావు వెల్లడించారు. పట్టణంలోని యాగర్లపల్లి, కడకట్ల, బేబి సెంటర్, వీకర్స్‌కాలనీ అర్బన్‌హెల్త్ సెంటర్ల పరిధిలో మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవం నిర్వహించారు. దోమ వల్ల మలేరియా వస్తుందని గుర్తించి, పారసైట్ జీవిత చక్రానికి చెందిన పరిశోధనకు గాను డాక్టర్ సర్ రోనాల్డ్ రాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్యాధికారులు శ్రావ్య, ఆనీషా, తనూజలు అధ్యక్షతన అవగాహన కార్యక్రమాలు జరిగాయి. ర్యాలీలు, ప్రతిజ్ఞలు చేశారు. మలేరియా దోమ ఎలా పుడుతుంది, మలేరియా వ్యాధిని ఎవరూ కనుగొన్నారు, దోమ కాటు వల్ల నష్టాలు, జాగ్రత్తలను వెల్లడించారు. ఆరోగ్య పర్యవేక్షకులు మంగతాయారు, పద్మ, కాంతారావు, ఆశాలు, టెక్నీషియన్స్, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



దోమల నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



తణుకులో దోమల నివారణ అంశంపై అవగాహన కల్పిస్తున్న వెంకటేశ్వరరావు

దోమల నివారణే వ్యాధుల నిరోధకం

తణుకు అర్బన్: దోమలను నివారించగలిగితే అనేక రోగాలను నిరోధించవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ గుడిమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ దోమ నివారణ దినోత్సవం సందర్భంగా తణుకు మునిసిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో దోమల వ్యాప్తిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమరహిత సమాజం.. ఆరోగ్యానికి సోపానం అనే నినాదంపై విద్యార్థి దశ నుంచే అవగాహక కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థులంతా దోమల నివారణకు కృషి చేయాలన్నారు. అనంతరం దోమల వల్ల వచ్చే వ్యాధులను వివరించారు. కార్యక్రమంలో ఫైలేరియా కంట్రోల్ యూనిట్ హెల్త్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు పి.సుజాత, ఎస్.శశి, ఎస్.హరిబాబు, వార్డు హెల్త్ సెక్రటరీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశ కార్యకర్తలు, హెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషి చేయాలి



తణుకు మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న సీడీపీఓ ప్రమోద కుమారి

తణుకు టౌన్: గ్రామాల్లో బాల్య వివాహాల నివారణకు అన్ని శాఖల సమన్వయంతో పని చేయాలని తణుకు ఐసీడీఎస్ సీడీపీవో ఎంటీఎస్ ప్రమోద కుమారి కోరారు. మంగళవారం తణుకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బాల్య వివాహాల నిరోధక చట్టం 2006పై అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలకు ఆమె అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిరోధక అధికారులకు బాల్య వివాహాల నివారణ, మహిళలు పని చేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణ, పోక్సో కేసులు, గృహ హింస, మహిళల అక్రమ రవాణా నివారణ, బాలికల విద్య వైద్య, పరిశుభ్రత వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో గ్రామస్థాయి బాల్య వివాహాల నివారణ కమిటీలకు శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ డీవీఎస్ఎస్ వర్మ, ఎంపీడీవో కె కిరణ్‌కుమార్, ఏసీడీపీవో ఆశారోహిణి, ఏఎస్ఐ ఏవీఎస్ రాజు, జిల్లా చైల్డ్ యూనిట్ ఆఫీసర్ ఎం రాజేశ్, ఈఓపీఆర్‌డీ ఏఎస్ఆర్ కోటేశ్వరరావు, పట్టణంలోని వార్డు సచివాలయ కార్యదర్శులు, మహిళా పోలీసు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యాన యాత్రలో నన్నయ్య విద్యార్థులు



ఉద్యాన వర్సిటీ సందర్శనలో నన్నయ్య వర్సిటీ విద్యార్థులు

తాడేపల్లిగూడెం: ఉద్యాన యాత్రలో భాగంగా ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఫుడ్ సైన్సు అండ్ టెక్నాలజీ విభాగంలో పోస్టుగాడ్యుయేషన్ చేస్తున్న విద్యార్థులు మంగళవారం వెంకట్రామన్నగూడెంలోని ఉద్యానవర్సిటీని సందర్శించారు. ఫుడ్ ప్రోసెసింగ్‌లో ఉపాధి అవకాశాల గురించి కృషి విజ్ఞానకేంద్రం అధిపతి ఇ.కరుణశ్రీ వివరించారు. సృజనాత్మకత గల విద్యార్థులు వ్యవసాయ, ఉద్యాన అనుబంధ రంగాల ఆధారిత ప్రోసెసింగ్‌ను అందిపుచ్చుకొని స్వయం ఉపాధి పొందే మార్గాలను వివరించారు. ప్రధాన మంత్రి ఆహార శుద్ధి పథకం, అగ్రిక్లినిక్, అగ్రి బిజినెస్ సెంటర్స్ ఏర్పాటు గురించి నాబార్డు అధికారి అనిల్‌కాంత్ వివరించారు. కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త కె.సతీష్ ప్రదర్శన క్షేత్రాలను విద్యార్థులకు చూపించారు.

ఘనంగా పెంట్లమ్మ చల్ది నైవేద్యాలు



పెంట్లమ్మ పూరిగుడి వద్ద చల్ది నైవేద్యాలు పెడుతున్న భక్తులు

పెంటపాడు: పెంటపాడు పురాతన గ్రామ దేవత పెంట్లమ్మవారి చల్దినైవేద్యాలు మంగళవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. గత 100 సంవత్సరాలుగా ఏటా మూడో శ్రావణ మంగళవారం చల్ది నైవేద్యాలు పెట్టడం ఆనవాయితీగా వస్తోందని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గ్రామ ఆడపడుచులు అమ్మవారికి చల్ది అన్నం, బెల్లంముక్క, పసుపు కుంకుమ, చీరెలు ఇతర పూజా సామగ్రితో సమర్పించుకున్నారు. ఉపాధ్యక్షుడు చామన విజయకుమార్, సత్తి నరసారెడ్డి, కోశాధికారి కొవ్వూరి బాలభాస్కరరెడ్డి, చామన సురేష్, శీలంశెట్టి రాము, వెలగల శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖరరెడ్డి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు భారత్‌బంద్‌కు సహకరించాలి



తేతలిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న తిర్రే రవిదేవా

తణుకు: ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ దేశ వ్యాప్తంగా బహుజన సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు తణుకులో మాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్న భారత్ బంద్‌కు పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలు, వాణిజ్య వ్యాపార సంస్థలు, హోటళ్ల యజమానులు, రవాణా సంస్థలు సహకరించాలని మాల ఐక్య వేదిక జాతీయ అధ్యక్షుడు తిర్రే రవిదేవా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సన్నాహక సమావేశం తణుకు మండలం తేతలి అంబేడ్కర్ భవనంలో కేసరపల్లి వెంకట్రావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు వెన్నపు సుధాకర్, దళిత నాయకుడు మొల్లం మైఖేల్, మాల ఐక్యవేదిక నాయకులు మర్రి నవీన్, బద్దె కిరణ్ పాల్గొన్నారు.

గూడెంకు ఎయిర్‌పోర్టు సాధిద్దాం

తాడేపల్లిగూడెం : గూడెంకు ఎయిర్‌పోర్టును సమన్వయంతో సాధిద్దామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతంలో తాను, మాజీ మంత్రి పైడికొండల, టీడీపీ నాయకులు బాపిరాజు కలిసి ఇక్కడ ఎయిర్‌పోర్టు కోసం ప్రయత్నం చేశామన్నారు. తాజాగా కేంద్ర విమానయాన శాఖ మంత్రి గూడెంలో ఎయిర్‌పోర్టు ప్రకటన చేసినందున గ్రీన్ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు కావాల్సిన భూమిని ఇక్కడ చూడటంలో కూటమి నాయకులు ప్రయత్నం చేద్దామన్నారు. ఇదే విషయాన్ని పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. అనంతరం ప్రత్తిపాడు సాక్షి కార్యాలయం నుంచి గూడెం పట్టణం వరకు రహదారిని మునిసిపల్ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఇటీవల మరమ్మతు పనులను ప్రారంభించిన నేపథ్యంలో ఆయన క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. త్వరితగతిన మరమ్మతు పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

23న ప్లేస్‌మెంట్ డ్రైవ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శ్రీ వాసవి జీఎంఆర్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23వ తేదీ శుక్రవారం ఇంప్లాక్ట్ హెచ్ఆర్ సహకారంతో హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీస్‌లు, ఐసీఐసీఐ బ్యాంక్‌లో నియామకాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వీఎస్ఎన్ శ్రీనివాస్ వెల్లడించారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనేందుకు డిగ్రీ అర్హతని, ఫైనల్ ఇయర్‌లో ఉన్న వారు పాల్గొనవచ్చునని, వయస్సు 29 ఏళ్ల లోపు ఉండాలన్నారు. రిలేషన్‌షిప్ మేనేజర్/సీనియర్ ఆఫీసర్, అసిస్టెంట్ మేనేజర్/ జూనియర్ ఆఫీస్ ఉద్యోగాలకు అభ్యర్థులు 2.8 – 3.5 ఎల్‌సీపీఏ జీతం, ఇన్‌సెంటీవ్స్ ఇస్తామన్నారు. పట్టణ పరిసర ప్రాంతాల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఫోన్ నంబర్లు 94408 03234, 93926 29278లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

ఫిజియోథెరపీ యంత్రం బహూకరణ

తణుకు టౌన్: తణుకు బ్యాంక్ కాలనీలో గల సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బోళ్ల వీర వెంకన్న ఫిజియోథెరపీ కేంద్రానికి రూ.35 విలువ చేసే ఫిజియోథెరపీ యంత్రాన్ని పట్టణానికి చెందిన అతికాల ప్రసాదరావు బహూకరించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి తెలిపారు. మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో దాత ప్రసాదరావు నూతన యంత్రాన్ని బహూకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దాత ప్రసాదరావును అసోసియేషన్ సభ్యులు అభినందించారు. కార్యదర్శి ఎండీ స్వాహాలిక, కోశాధికారి ఆర్జి భాస్కరరావు, దాట్ల రామరాజు, సాంబశివరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో మంగళవారం బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ నరిశే సోమేశ్వరరావు జన్మదినోత్సవం సందర్భంగా అన్నదానం చేశారు. యువమోర్చా నాయకులు గరగ ప్రసాద్, దూద్ బాషా, సింగం జగపతి రామయ్య (జగన్) తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు



చినతాడేపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ వెంకటరత్నం

తాడేపల్లిగూడెం రూరల్: ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయం మేలని ప్రకృతి వ్యవసాయం తాడేపల్లిగూడెం జోనల్ కోఆర్డినేటర్ గద్దె వెంకటరత్నం అన్నారు. మంగళవారం మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్ వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన సందర్శించారు. ప్రతి రైతు తన పొలంలో వరితో పాటు కూరగాయల పంటలను పండించాలని సూచించారు. ఎటువంటి ఎరువులు, పురుగు మందులు లేకుండా కూరగాయలను పండించడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. డివిజన్ ఇన్‌చార్జి సుబ్బారావు, మండల ఇన్‌చార్జీలు మరిడి నాగకృష్ణ, వి.వీర్రాజు, ప్రకృతి వ్యవసాయం కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా డాక్టర్ హత్యపై విచారణ చేయాలి



తణుకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

తణుకు టౌన్/తణుకు: కోల్‌కతా ఆర్‌జీ కార్ మెడికల్ కాలేజీలో జరుగుతున్న అక్రమాలు వెలుగు చూస్తాయనే భయంతోనే మహిళా ట్రైనీ డాక్టర్ హత్య జరిగిందని దీనిపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి పేర్కొన్నారు. మంగళవారం తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన నిరసన ధర్నాలో భాగంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లో మహిళా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ హోం మంత్రిగా, మహిళా సంక్షేమ మంత్రిగా ఉన్నా మహిళలకు భద్రత లేకపోవడం దారుణమన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేసిన ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేసి శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనలో బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తణుకు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొండా శ్రీనివాసులు, న్యాయ వాదులు కౌరు వెంకటేశ్వర్లు, పొట్ల సురేష్, జీ అంబేడ్కర్, పట్ల శ్రీను, అనుకుల రమేష్, డీ అప్పారావు, బీ విక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అశోక్ వర్మకు వినతి పత్రం అందజేశారు.



మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో తణుకులో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ

తణుకు: కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై సభ్యసమాజం తలదించుకునేలా అత్యాచారం చేసి అత్యంత కిరాతకంగా హత్య చేసిన నిందితులను ఉరి తీయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి డిమాండ్ చేశారు. వైద్య విద్యార్థినిపై అమానుషంగా లైంగిక దాడి చేసి హత్య చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం తణుకు పైడిపర్రు జంక్షన్ వద్ద ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి వైద్య విద్యార్థినికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పుష్పకుమారి, మహిళా సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షురాలు సావారపు దేవి మాట్లాడుతూ ప్రభుత్వాల తీవ్ర నిర్లక్ష్యం కారణంగానే మహిళలపై లైంగిక దాడులు పెచ్చుమీరుతున్నాయన్నారు. మహిళలపై ఎక్కడ ఇలాంటి ఘటనలు జరిగినా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని, దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుని మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు పిండి సత్యవతి, మీసాల జయలక్ష్మి, పట్టపు కృష్ణవేణి, మేకా వెంకటలక్ష్మి, యాతం నాగమణి, కోలా రత్నకుమారి, జొన్నల లక్ష్మి, కవల మంగతాయారు పాల్గొన్నారు.